సాక్షి
జోగులాంబ గద్వాల

ఆదివారం ❘ 8 ❘ జనవరి ❘ 2023



యురేనియం కలకలం
నల్లమలలో యురేనియం పరిశీలనకు బోరు డ్రిల్లింగ్ చేపట్టడంతో కలకలం రేగింది.
వివరాలు 10లో ▸



గుప్పుమంటున్న సారా
నాగర్‌కర్నూల్ జిల్లాలోని అటవీ గ్రామాల్లో సారా తయారీ జోరుగా సాగుతుంది.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31.1 /14.2
ఉదయం ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తాయి. మంచు కురుస్తుంది. రాత్రి వేళ చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ధరణి సమస్యలు పరిష్కరించాలి



గద్వాల రూరల్: జిల్లాలో పెండింగులో ఉన్న ధరణి సమస్యలను త్వరితగతంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భం ఆయన మాట్లాడుతూ టీఎం33, జీఎల్ఎం సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగులో ఉన్న వాటికి వెంటనే పరిష్కరించాలన్నారు. అదేవిధంగా బృహత్‌పల్లెప్రకృతి వనాల కోసం స్థల సేకరణ చేపట్టాలన్నారు. సమావేశంలో కలెక్టరేట్ ఏవోలు యాదగిరి, రాజు, అన్ని మండలాల తహశీల్దార్లు, డీఆర్‌డీఏ ఏపీడీ నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో సీనియర్ సివిల్ జడ్జి పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గద్వాల అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రభాకర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతలను వివరించారు. ఏకశిలపై అనంతశయనస్వామి, లక్ష్మీదేవి, వరహస్వామి, ఆంజనేయ స్వామి ఆవిర్భవించడం పట్ల న్యాయమూర్తి విశిష్టత గల ప్రాంతంగా పేర్కొన్నారు. అనంతరం స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి మెమోంటో, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది యుగంధర్, ఆలయ అర్చకులు మధుసూధనాచారి, రవిచారి, చంద్రశేఖర్‌రెడ్డి, బాబురావు తదితరులు ఉన్నారు.

విదేశీ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ప్రసాద్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ విద్యార్థులు అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, న్యూజిల్యాండ్, సింగపూర్, జర్మనీ దేశాల్లో పీజీ కోర్సులను అభ్యసించేందుకు ఈనెల 23వ తేదిలోగా కులం, ఆదాయం, ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ సర్టిఫికెట్స్‌లతో http://telanganaepass.cgg.gov.inఅనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు, ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు మూడు జతల జిరాక్స్ కాపీలను ఈనెల 31లోగా జిల్లా కేంద్రంలోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాయలంలో సమర్పించాలని, ఎంపికైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌గా రూ.20లక్షలతో పాటు విమాన టికెట్ ఖర్చులను అందజేస్తామని, ఈ ఆవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కవితా పురస్కారానికి ఎంపిక

గద్వాల అర్బన్: 2022వ సంత్సరానికి మహాకవి మద్దూరి నాగేష్ స్మారక కవిత పురస్కారానికి జిల్లా వాసి రాసిన పుస్తకం ఎంపికైంది. మల్దకల్ మండలం, దాసరిపల్లికి చెందిన ఆవనిశ్రీ రాసిన దిక్కార ఖడ్గం పుస్తకం ఎంపికైంది. ఈమేరకు ఈనెల 10వ తేదిన విజయవాడలో జరగబోయే కార్యక్రమంలో పురస్కారానికి అందుకోనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

12నుంచి జిల్లా, మండల స్థాయి పోటీలు

గద్వాల క్రైం: స్వామి వివేకనంద జయంతి సందర్భంగా ఈ నెల 12వ తేది నుంచి జిల్లా, మండల స్థాయి పోటీలను పోలీసుశాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎస్పీ రంజన్‌రతన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని యువత, క్రీడాకారులు అన్ని మండలాల పోలీసు స్టేషన్‌లో వారి టీం పేర్లను ఈ నెల 8వ తేదీలోగా ఇవ్వాలని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నామని, మండల స్థాయిలో గెలిచిన టీంలకు జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయని, ఈ పోటీలను క్రీడాకారులు స్వదినియోగం చేసుకోవాలని, వివరాలకు సెల్ నం. 7659947007కు సంప్రదించాలని తెలిపారు.

దాతల చేయూత

టీబీ వ్యాధిగ్రస్తులకు అండగా నిలుస్తున్న వైనం



రాజోళిలో సరుకులు అందజేస్తున్న దాతలు

- ప్రతి నెలా బియ్యం, నిత్యావసర సరుకుల అందజేత
- ప్రభుత్వంతోపాటు అదనంగా అందుతున్న సహాయం
- గవర్నర్ తమిళిసై ప్రశంస

రాజోళి: జిల్లాలో టీబీ (క్షయ) వ్యాధిగ్రస్తులు పడుతున్న ఇబ్బందులకు, నిత్యావసర సరుకుల కొనుగోలుకు పడుతున్న కష్టాలను చూసి కొన్ని హృదయాలు చలించాయి. వారి ఆరోగ్యం కుదుటపడేందుకు సహాయం చేసే విధంగా దాతలు ముందుకు వస్తున్నారు. వ్యాధిగ్రస్తులకు నెలనెలా బియ్యంతో పాటు ఇతర సరుకులు అందించేందుకు, వైద్యాధికారుల అభ్యర్థన మేరకు మరికొందరు ముందుకొచ్చి ప్రతి నెలా క్షయ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు, పౌష్టికాహారం అందిస్తూ అండగా నిలుస్తున్నారు.

మేమున్నామంటూ..

ఇలా వ్యాధిగ్రస్తుల పరిస్థితిని బట్టి దాతలు ముందుకు వచ్చారు. వీరు కాక జిల్లాలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నుండి ప్రతి నెల 600 కేజీల బియ్యం ఇతర సరుకులు 200 మందికి అందుతున్నాయి. దాతలు చేస్తున్న సహాయాన్ని ఫుడ్ భాస్కెట్ అనే పేరుతో బాదితులకు అందచేసి, వారికి తోడుగా మేమున్నామని ఆత్మస్థైర్యాన్ని కల్పిస్తున్నారు. సహాయం చేసిన దాతల గురుంచి సంబందిత అధికారుల ద్వారా విషయం తెలుసుకున్న గవర్నర్ 13.09. 2022 తేదీన తమిళిసై వారిని హైదరాబాద్‌లో సన్మానించి, వారి సేవలను కొనియాడారు. దాతలు చేస్తున్న సహాయాన్ని ఆదర్శంగా తీసుకుని, మరి కొందరు దాతలు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు.

సెంటర్ల వారీగా బాధితులకు అందుతున్న సహాయం

మండలం	వ్యాధిగ్రస్తులు
ధరూరు	3
ఉప్పేరు	15
రాజోళి	17
అయిజ	6
గట్టు	1
మల్దకల్	6
వడ్డేపల్లి	4
మానవపాడు	2
వెంకటాపురం	5
రాంనగర్	2
ఎంసీహెచ్	1



దాతలను అభినందిస్తున్న గవర్నర్ తమిళిసై (ఫైల్)

ఒక్క పిలుపుతో ముందుకొచ్చి..

జిల్లాలో 1,530 మంది దాకా వ్యాదిగ్రస్తులు ఉన్నట్లు వైద్య శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల వరకు మందులు అందించడం జరుగుతుంది. కానీ క్షయ వ్యాధి వచ్చాక దగ్గు, ఇతర ఆరోగ్య సమస్యలతో నిత్యం ఇబ్బందులు పడుతుంటారు. దీంతో వారు శారీరకంగా, మానసికంగా కృంగిపోతుంటారు. అలాంటి వారిలో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న వారిని, కుటుంబ పరిస్థితులు బాగాలేని వారికి ప్రధానంగా దాతల నుంచి సహాయం అందే విధంగా చూస్తున్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుంచి నెలకు రూ.500 చొప్పున ఆరు నెలల పాటు ఆర్థిక సహాయం అందుతుంది. ఇది కూడా సరిపోక పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడే వారికి దాతల నుండి అదనపు సహాయం అందేలా వైద్య శాఖతో పాటు గతంలో జిల్లా అదనపు కలెక్టర్‌గా శ్రీహర్ష ఇచ్చిన పిలుపు మేరకు దాతలు ముందుకు వచ్చారు. నాలుగు నెలల నుంచి ఈ దాతల సహాయం అందుతూనే ఉంది. బాధితులకు పౌష్టికాహారం అందడంతో శారీరకంగా, మానసికంగా కోలుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటికే 19 మంది దాతలతో 62 మంది వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా బియ్యం, మంచినూనె, కందిపప్పు, సబ్బులు,ఇతర నిత్యావసర, పౌష్టికాహార వస్తువులను అందజేస్తున్నారు.

వారి పరిస్థితి చూసి చలించిపోయా



టీబీ వ్యాధితో బాధపడేవారి ఆరోగ్య, కుటుంబ పరిస్థితిని చూసి చలించిపోయాం. కొందరైతే పూట గడవని పరిస్థితి. అలాంటి వారికి సహాయం చేయాలనుకున్నాం. అప్పుడే అధికారులు కూడా వారికి నిత్యావసర సరుకులు అందించి సహాయం చేయవచ్చనే విషయాన్ని మాకు తెలియచేశారు. జిల్లాలోని వ్యాదిగ్రస్తులకు మా తరపున సహాయం అందడం చాలా సంతోషంగా ఉంది.

– గార్లపాడు సుదర్శన్, దాత, గద్వాల

సంతృప్తినిచ్చింది

టీబీ వ్యాధితో బాధపడుతున్న వారి ఇబ్బందులు చూసి నెల నెలా సహాయం చేసేందుకు ముందుకు వచ్చాం. గత నాలుగు నెలలుగా ఈ సహాయం అందిస్తూనే ఉన్నాం. దీన్ని గుర్తించిన గవర్నర్ అభినందించారు.

– పాండు, దాత, గద్వాల

వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు



టీబీ వ్యాధిగ్రస్తులకు నెల నెలా బియ్యం, ఇతర సరుకులు అందిస్తున్న దాతలను ప్రత్యేకంగా గుర్తిస్తున్నాం. వారి వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచుతున్నాం. వారికి ప్రత్యేకంగా సరిఫికేట్లు అందచేస్తున్నాం. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున ప్రతి నెల 600 కేజీల సహాయం అందుతుంది. మరికొందరు దాతల ద్వారా కూడా బియ్యం, నిత్యావసర సరుకులు అందుతున్నాయి.

– సాదిఖ్, టీబీ జిల్లా కో ఆర్డినేటర్

మరింత మంది ముందుకు రావాలి



టీబీ వ్యాధిగ్రస్తుల పట్ల దాతలు స్పందిస్తున్న తీరు హర్షనీయం. ఇప్పటికే జిల్లాలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు, రైస్ మిల్లర్స్, వైద్య శాఖలోని ఏఎన్ఎంలు, సర్పంచులు స్పందించి ప్రతి నెలా బియ్యంతో పాటు పౌష్టికాహార సరుకులు అందజేస్తున్నారు. జిల్లాలో ఉన్న వ్యాధిగ్రస్తులను దృష్టిలో ఉంచుకొని తీసుకువచ్చిన కార్యక్రమం పట్ల దాతలు ఇంకా స్పందించాలి. తమ వంతుగా చేసే సహాయం బాధితులకు బాసటగా నిలుస్తుంది.

– ఎస్.సిద్దప్ప, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్

కనులపండువగా రాములోరి కల్యాణం



బీచుపల్లిలో రాములోరి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎర్రవల్లిచౌరస్తా: శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురష్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణ వేడుకను కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహ ఆచారి ఆధ్వర్యంలో సీతారాములను అందంగా ముస్తాబుచేసి వేద మంత్రాల నడుమ రాములోరికి వైభవంగా కళ్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు ఆధ్వర్యంలో కల్యాణం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



హాజరైన భక్తులు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల రూరల్: జిల్లా వ్యాప్తంగా చేపట్టిన వివిధ రకాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. శనివారం జెడ్పీ కార్యాలయంలో 7వ స్థాయీ సంఘం సమావేశాల్లో ఆమె పాల్గొని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోని రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలను మందగమనంతో కొనసాగుతున్నాయని పనుల్లో వేగం పెంచి నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా 1, 6వ స్థాయి సంఘ సమావేశాలో ఆయా స్థాయి సంఘ చైర్మన్లు పాల్గొని అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో విజయనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మోసపూరిత పాలన



మాట్లాడుతున్న డీకే అరుణ

గద్వాల: రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని, సీఎం కేసీఆర్ సాగిస్తున్న అబద్ధపు, మోసపూరిత పాలనను గద్దె దించేందుకు సమయం ఆసన్నమైందని బీజేపీ జాతీయ ఉపాధ్యాక్షురాలు డీకే అరుణ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కమిటీ సమ్మేళనానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు, ఇక్కడి ఎమ్మెల్యే నేనే రాజు అనేలా వ్యవహరిస్తూ.. పోలీసులతో ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ నేతలను కొనొచ్చేమోకానీ, ప్రజలను కొనలేరన్నారు. దేశంలోనే రూ.5 లక్షల కోట్ల అప్పులున్న రాష్ట్రంగా తెలంగాణను మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ధ్వజమెత్తారు. ప్రస్తుతం ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వ ఉందన్నారు. నియోజకవర్గంలోని సమస్యలు విన్నవించుకునేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలకు ఆపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. స్వరాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్న అన్నదాతలను ఆదుకోకుండా ఇతర రాష్ట్రాలకు వెళ్లి అక్కడి రైతులకు పరిహారం చెల్లించడం సిగ్గుచేటుగా ఉందన్నారు. ఈసారి కేసీఆర్ పిట్టకథలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన

బీజేపీతోనే దేశంలో సుస్థిర పాలన అందుతుందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్తను సిద్ధం చేయాలని, బూత్‌స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ఎనిమిదిన్నర ఏళ్ల పాలనలో పలు సంక్షేమ పథకాలు అమలు చేసి దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లారన్నారు. అంతకుముందు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డాతో వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, కృష్ణ, గడ్డం కృష్ణారెడ్డి, డీకే స్నిగ్ధారెడ్డి, రవి కుమార్, రామంజనేయులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి



అలంపూర్‌లో వాల్మీకి మహర్శి ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. శనివారం అలంపూర్‌లో వాల్మీకి మహర్షి ఆలయ ప్రహరీని రూ.4లక్షలతో చేపట్టగా.. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాల్మీకుల సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ స్థాయి భవన నిర్మాణానికి స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, వాల్మీకి నాయకులు రమేష్ నాయుడు, శేషన్న, సంజీవ, తిరుమల, మద్దిలేటి, శేఖర్ రమణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం అవసరం



విద్యార్థులతో ఫోరం నాయకులు

గద్వాల: పోటీ ప్రపంచంలో విద్యార్థులను ప్రోత్సహించినప్పుడే వారు మరింత ముందుకు వెళ్తారని నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శి ప్రతాప్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాన్ ప్రతిష్టన్ సౌజన్యంతో జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు టాలెంట్ టెస్టును నిర్వహించారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన టాలెంట్ టెస్టుకు జిల్లాలోని 65 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి విద్యార్థికి విద్యార్థి దశ చాలా కీలకమైందన్నారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి చదువులో అత్యంత ప్రతిభ అవసరమన్నారు. విద్యార్థులు ఉన్నతస్థానంలో ఉండాలనే లక్ష్యాలను నిర్దేశించుకొని పట్టుదలతో దాన్ని సాధించాలని సూచించారు.

విజేతలు వీరే..

తెలుగు మీడియం విభాగంలో రాము, మహబూబ్‌పాషా, సింధూ, ఇంగ్లిష్ మీడియంలో శ్రావణి, అనిల్, నందిని, ప్రైవేట్ స్కూల్ విభాగంలో శశిధర్, శిరీష విజేతలుగా నిలవగా.. బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విష్ణు, నారాయణ, నాగరాజు, పరుశరామ్, లక్ష్మిరెడ్డి, వెంకటేష్ శెట్టి, శీలన్న, శాయన్న, రాజు పాల్గొన్నారు.

క్రీడలతో భవిష్యత్



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో శనివారం బీకేఎంఆర్ ప్రీమియర్ లీగ్ సీజన్–3 క్రికెట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడికి క్రీడాస్ఫూర్తి ముఖ్యమని, దీని వల్లే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అభిప్రాయపడ్డారు. క్రీడల అభ్యున్నతికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. జిల్లా పేరును రాష్ట్రం, జాతీయస్థాయిలో నిలిపేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి క్రీడాకారుడు జాతీయస్థాయి పోటీలను లక్ష్యంగా నిర్దేశించుకొని ఆడాలని సూచించారు. ప్రతిభను వెలికితీయడానికి పోటీలు దోహదం చేస్తాయని చెప్పారు. అంతకు ముందు వివిధ జట్ల క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడ, జిల్లా క్రీడల అధికారి రమేష్‌బాబు, క్రికెట్ కోచ్ శ్రీనివాసులు, స్టేడియం ఇన్‌చార్జి జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదల ఉంటేనే లక్ష్యసాధన



గట్టు కళాశాలలో మాట్లాడుతున్న సీఐ నాగేష్

గట్టు: ప్రతి విద్యార్థికి కృషి, పట్టుదల ఉంటేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకొవచ్చునని సాయుధ దళ సీఐ నాగేష్ తెలిపారు. శుక్రవారం గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ నాగేష్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే గెలుపు ఇళ్ల ముందర, ఓటమి కాళ్ల ముందర ఉండి విజయం వరిస్తుందన్నారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, క్రమ శిక్షణతో చదువుకుంటేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని తెలిపారు. తల్లిదండ్రులు, గురువులు గర్వించే స్థాయికి ప్రతి విద్యార్థి చేరుకోవాలని కోరారు. పిల్లల ప్రవర్తన బట్టే తల్లిదండ్రుల మైండ్ సెట్ మారుతుంటుందని, విద్యార్థులు చదువుపైనే దృష్టిని సారించాలని, రోజు వారిగా న్యూస్ పేపర్లను చదివే అలవాటును అలవర్చుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని, సమాజానికి మన వంతు సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి రాజు, లెక్చరర్లు, కాలేజీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



క్రీడా ప్రాంగణం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న రంజిత్ కుమార్ తదితరులు

ధరూరు: గ్రామీణ ప్రాంత ప్రజలను కేవలం ఓటు బ్యాంకు గానే ఉపయోగించుకునే నాయకులు వారికి కనీస మౌళిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని, ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ అన్నారు. మండలంలోని కోతులగిద్దలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్విహించారు. శనివారం గ్రామంలోని కాలనీల్లో పర్యటించి గ్రామస్తులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అడిగితెలుసుకున్నారు. కనీసం మురుగు కాల్వలు లేక రోడ్లపైనే మురుగు నీరు పారుతోందని, కొన్ని కాలనీలకే విద్యుత్ సరఫరా చేశారని, ఇండ్ల మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లినా తొలగించలేదన్నారు. స్థానిక పాఠశాలలో ముగ్గురే ఉపాధ్యాయులు ఉండడంతో చదువులు సక్రమంగా సాగడంలేదని, మిషన్ భగీరథ నీరు వృధాగా పోతున్నా సర్పంచు, కార్యదర్శి పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ పొలాన్ని క్రీడా ప్రాంగణంగా చూపించి బిల్లులు కాజేశారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకపోతే మరో నెల రోజుల్లో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లవన్న, గోవిందు, రాము, శాంతన్న, రంగస్వామి, జమ్మన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బల్మూర్: మండలంలోని గట్టుతుమ్మెన్ చెందిన కొమ్ము మల్లయ్య(48) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ శివానందం గౌడ్ శనివారం తెలిపారు. మృతుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా డిసెంబర్ 31న ఇంట్లో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి వికటించడంతో శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతునికి భార్య జయమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఉదండాపురంలో..

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇటిక్యాల మండలంలోని ఉదండాపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గోకారి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్డె నర్సింహులు (30) మనస్తాపంతో శుక్రవారం రాత్రి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తల్లి తిమ్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రైతు ఆత్మహత్య

మానవపాడు: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సంఘటన శనివారం మండలంలోని జల్లాపురంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. జల్లాపురం చెందిన మంగలి రాజు(33) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంతకాలంగా ఆయన మానసికస్థితి బాగా లేనందున శుక్రవారం మధ్యాహ్నం గ్రామ శివారులో గల ఆర్డీఎస్ కాల్వ సమీపంలో పురుగు మందు తాగి పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. కోలుకోలేక శనివారం మృతి చెందాడు. సంఘటనపై భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మానవపాడు: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు బొలెరో వాహనంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన సీతు (27) వెళ్తున్నాడు. కాగా మండలంలోని బోరవెల్లి శివారులో జాతీయ రహదారిపై బొలెరో వాహనం టైరు పంక్చర్ కావడంతో దాన్ని మారుస్తున్నాడు. వెనుక వైపు నుంచి వేగంగా లారీ వచ్చి ఢీకొనగా సీతు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అలంపూర్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సంఘటనపై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినితో పాఠశాలలో విధులు నిర్వర్తించే కంప్యూటర్ ఆపరేటర్ అసభ్యంగా ప్రవర్తించిన తీరు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో శుక్రవారం వారు పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. గతంలోనూ ఆ వ్యక్తి ఇలాగే ప్రవర్తించినప్పటికీ పాఠశాలలోనే కొనసాగించారు. ఈ విషయమై పాఠశాల కరస్పాండెంట్‌ను వివరణ కోరగా విషయం వాస్తవమేనని, విధుల నుంచి తొలగిస్తామని చెప్పారు.

యువతి అదృశ్యం

బాలానగర్: మండలంలోని సూరారం చెందిన యువతి శనివారం ఉదయం నుంచి అదృశ్యమైంది. ఆచూకీ దొరకకపోవడంతో యువతి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయప్రసాద్ తెలిపారు.

విద్యుత్‌స్తంభం ఎక్కి వ్యక్తి హల్‌చల్

- గంటపాటు సరఫరా నిలిపివేత

కల్వకుర్తి టౌన్: మద్యం మత్తులో వ్యక్తి విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. శనివారం పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో వాసవీనగర్‌కు చెందిన వెంకట్ రెడ్డి మద్యం మత్తులో విద్యుత్ స్తంభం ఎక్కటంతో పట్టణంలో దాదాపుగా గంటపాటు సరఫరాను నిలిపివేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతనిని సముదాయించి కిందకు దించారు. ఇదే విషయమై ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా ఇతను గతంలో పలుమార్లు ఇలాంటి చర్యలకు పాల్పడ్డాడని, అతనికి మతిస్థిమితం సరిగా లేకపోవటంతో ఇలా చేశాడని ఎస్ఐ తెలిపారు.

కేబుల్ వైర్ల చోరీ



ధరూరు: వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ మోటార్లకు ఉన్న విద్యుత్ కేబుల్ వైర్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని జాంపల్లి శివారులోని నెట్టెంపాడు కెనాల్ వెంట రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లకు సంబంధించిన విద్యుత్ వైర్లను శుక్రవారం అర్ధరాత్రి తీసుకెళ్లారు. దాదాపు 20 మోటార్ల వైరును దొంగతనం చేశారు. పొలాలకు నీళ్ల పారించేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

మళ్లీ గుప్పుమంటున్న సారా



నాటుసారాతో పట్టుబడిన వారితో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

- నల్లమల అటవీ గ్రామాల్లో జోరుగా తయారీ
- టార్గెట్లు, అవసరాలకు మాత్రమే దాడులు
- మామూళ్ల మత్తు వదలని అధికారులు

అచ్చంపేట: జిల్లాలోని అటవీ గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా జోరుగా నాటుసారా తయారీ జరుగుతోంది. ఎక్సైజ్‌శాఖ ప్రస్తుతం చూసీచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతకాలంగా స్తబ్దతగా ఉన్న గుడుంబా తయారీ, విక్రయాలు చాపకింద నీరులా మళ్లీ జోరందుకున్నాయి. దీనిని ప్రధాన ఆదాయ వనరుగా చేసుకుని తయారీదారులు రాత్రికి రాత్రి రిటేయిలర్స్‌కు చేరవేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రం నుంచి బెల్లం దిగుమతి అవుతుండగా స్థానికంగా పటిక లభిస్తోంది. ఫలితంగా అటవీ గ్రామాల్లో గుడుంబా తయారీ కుటీర పరిశ్రమగా మారింది. జిల్లాలోని అచ్చంపేట, లింగాల, అమ్రాబాద్, పదర, ఉప్పునుంతల, బల్మూర్, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి మండలాల్లో ఎక్కువగా గుడుంబా తయారుచేస్తున్నారు. స్థానిక స్మగ్లర్లు వివిధ ప్రాంతాల నుంచి బెల్లాన్ని తీసుకొచ్చి తయారీదారులకు దిగుమతి చేస్తున్నారు. ఇందులో ఆయా మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు హైదరాబాద్, దేవరకొండ, కర్ణాటక రాష్ట్రాల నుంచి బెల్లాన్ని కొనుగోలు చేసి వివిధ వాహనాల్లో తీసుకొచ్చి రహస్య ప్రదేశాల్లో నిల్వ ఉంచుతున్నారు. అక్కడి నుంచి నల్లమల ప్రాంతంలోని చోటా స్మగ్లర్లకు విక్రయిస్తున్నారు. జిల్లాకు బెల్లం వివిధ ప్రాంతాల నుంచి వస్తుండగా పటికను గుట్టుచప్పుడు కాకుండా కొందరు స్థానిక కిరాణా వ్యాపారులు విక్రయిస్తున్నారు. సారా తయారవుతున్న తండాలు, గ్రామాల గురించి ఎక్సైజ్ అధికారులకు పూర్తి సమాచారం ఉన్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, నెల టార్గెట్‌ల కోసం కేసులు నమోదు చేస్తున్నట్లు తెలుస్తోంది.

అడవులే అడ్డా..

ఎక్సైజ్ అధికారుల దాడుల నుంచి తప్పించుకునేందుకు గుడుంబా తయారీ అడ్డాను అడవుల్లోకి మార్చేశారు. గ్రామానికి సమీపంలో ఎవరూ వెళ్లలేని ప్రాంతాల్లో తయారుచేస్తున్నారు. పగలంతా కాచిన సారాను రాత్రి ఇంటికి తెచ్చి, అనంతరం విక్రయిస్తున్నారు.

ఊరూరా జాతర..

మద్యం ధరలు అమాంతం పెరిగిపోవడంతో చుక్క లేనిదే కంటిమీద కునుకుపట్టని మందుబాబులు గుడుంబాను తీసుకుంటున్నారు. ఈ పరిస్థితిని ఆసరా చేసుకున్న తయారీదారులు రోజురోజుకూ గుడుంబా తయారీని పెంచుతున్నారు. ప్రతి గ్రామంలో దుకాణాలకు గుడుంబా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకసీసా రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. స్థానికంగా ఎక్సైజ్ నిఘా ఉండడంతో గుడుంబా వ్యాపారం అంతా ఫోన్‌కాల్ మీద ఆధారపడి కొనసాగుతోంది.

దాడులు నిర్వహిస్తున్నాం..

గుడుంబాపై ఉక్కుపాదం మోపబోతున్నాం. నిత్యం నిఘా పెట్టి రూట్‌వాచ్ చేస్తూ పట్టుకొనే ప్రయత్నం చేస్తున్నాం. దొరికిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. రెండోసారి దొరికితే బైండోవర్ చేసి జరిమానా కట్టిస్తున్నాం. పీడీ యాక్టు కూడా నమోదు చేస్తున్నాం. నిందితులపై కేసులు నమోదు చేస్తున్నాం. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు.

– కృష్ణయ్య, ఎక్సైజ్ సీఐ, అచ్చంపేట

నల్లమలలో యురేనియం కలకలం



నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్న జిల్లా వాటర్ లెవలింగ్ అధికారి రమాదేవి

- బోరు డ్రిల్లింగ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

అమ్రాబాద్: నల్లమలలో మరోసారి యురేనియం కలకలం రేగింది. యురేనియం తవ్వకాలు, అన్వేషణకు వ్యతిరేకంగా ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసినప్పటికీ బోరు డ్రిల్లింగ్ సమయంలో మట్టి నమూనా సేకరణ చేస్తుండడంతో బోరు డ్రిల్లింగ్‌ను అడ్డుకున్నారు. శనివారం ఉదయం మండలంలోని తిర్మలాపూర్(బీకే) గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మహారాష్ట్రకు చెందిన బోరు వాహనంతో డ్రిల్లింగ్ పనులు మొదలు పెట్టారు. ప్రతి మీటర్‌కు ఒకసారి మట్టి నమూనాలు కవర్లల్లో సేకరిస్తుండటంతో అనుమానం చెందిన గ్రామస్తులు డ్రిల్లింగ్‌ను అడ్డుకున్నారు. యురేనియం తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు తోడు కావడంతో పనులు నిలిపి వేశారు. విషయం తెలుసుకున్న వాటర్ లెవలింగ్ జిల్లా అధికారి రమాదేవి గ్రామానికి చేరుకుని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 17వాటర్‌షెడ్ పథకాలు ఉన్నాయని నేషనల్ వాటర్ లెవలింగ్ అథారిటీ సూచనల మేరకు భూఅంతర్భాగం పొరల్లో నీటి శాతాన్ని తెలుసుకునేందుకు బోరు వేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఇప్పటికే కల్వకుర్తి, వెల్దండ, చారగొండ తదితర మండలాల్లో 28బోర్లు వేసినట్లు వివరించారు. అయినా స్థానిక ప్రజలు వినలేదు. దీంతో డ్రిల్లింగ్‌ను పూడ్చివేసి బోరు వాహనాన్ని అక్కడి నుంచి పంపించారు.

యురేనియంపై ఆందోళన

2009 సంవత్సరం నుంచి పరిశీలించిన యురేనియం సర్వే ఆఫ్ ఇండియా అధికారులు 2011లో తిర్మలాపూర్(బీకే) గ్రామంలోనే 12బోర్లు వేసి మట్టి నమూనాలు సేకరించారు. ఈ ప్రాంత ప్రజలు బోరు డ్రిల్లింగ్‌ను అడ్డుకొని ఆపేశారు. తిరిగి మరోమారు డ్రిల్లింగ్ చేసి మట్టి నమూనాలు సేకరిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వాల తీరు చూస్తే యురేనియం అన్వేషణ చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్త మవుతున్నాయని నల్లమల యురేనియం వ్యతిరేక జేఏసీ కన్వీనర్ నాసరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు యురేనియం తవ్వకాలకు ముందుకొస్తే అడ్డుకొని తీరుతామని నల్లమల అడవి, కృష్ణ జలాలను కాపాడుతామని తెలిపారు.



తిర్మలాపూర్(బీకే)లో బోరు డ్రిల్లింగ్ చేస్తున్న బోరు వాహనం

ఇథనాల్ కంపెనీ వద్దంటూ నిరసన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మరికల్: జూరాల నుంచి కోయిల్‌సాగర్‌కు వచ్చే నీటిని అనుమతి లేకుండా ఇథనాల్ కంపెనీ తీసుకెళ్తుందని, ఈ కంపెనీ తమకు వద్దంటూ నాలుగు గ్రామాల ప్రజలు శనివారం రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. ఆందోళనకు వస్తున్న వారిని అడ్డుకునేందుకు పోలీసులు భారీగా మోహరించారు. దీంతో పోలీసుల, గ్రామస్తుల మధ్య ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు లాఠీకి పని చెప్పడంతో పలువురికి గాయాలయ్యాయి. మరింత ఆగ్రహంతో చిత్తనూర్, ఎక్లాస్‌పూర్, రాంపూర్, కన్మనూర్, జిన్నారం గ్రామస్తులు కంపెనీకి వ్యతిరేకంగా ఎక్లాస్‌పూర్ స్టేజి వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. అధికారులు వచ్చే వరకు రాస్తారోకను విరమించేది లేదని మొండికేశారు. రైతులకు వచ్చే నీటిని అక్రమంగా కంపెనీకి తరలించవద్దని అడ్డుకుంటే తమపై అక్రమ కేసులు పెట్టడం ఎంత వరకు న్యాయమని గ్రామస్తులు ప్రశ్నించారు. కంపెనీ వల్ల దాదాపు 50 గ్రామాలకు ముప్పు ఉందని, గతేడాది నుంచి ఆందోళన చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదన్నారు. తమపై పెట్టిన అక్రమ కేసులు తొలగించి, కంపెనీ పనులు పూర్తిగా నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రామ్‌కోటి ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారుల డిమాండ్లను తెలుసుకొని వారిని శాంతిపజేశారు.

పోలీసుల దౌర్జన్యం తగదు

ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ప్రజలపై కేసులు పెట్టి నిర్బంధించడం తగదని మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు జీవన్‌కుమార్, వసంత లక్ష్మి అన్నారు. శనివారం వారు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కంపెనీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయాలన్నారు. ప్రజల అభిప్రాయల మేరకు కంపెనీ రద్దు చేయలన్నారు. సమావేశంలో బాలరాజు, రోహిత్, సంధ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

మట్టి టిప్పర్, ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఉప్పునుంతల: మండల కేంద్రం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న మట్టి టిప్పర్, 4ఇసుక ట్రాక్టర్లను శనివారం మధ్యాహ్నం ఆర్డీఓ ఆదేశాల మేరకు వీఆర్ఏలు పట్టుకున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను మండల పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామని డీటీ సరస్వతీ తెలిపారు. టిప్పర్‌ను అచ్చంపేట ఆర్డీఓ కార్యాలయం వద్దకు పంపినట్లు తెలిపారు. ఉప్పునుంతల శివారులోని కేఎల్ఐ కాల్వ వెంట మట్టిని కొన్ని నెలలుగా వ్యాపారులు అచ్చంపేటకు టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇరుగేషన్, రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. మండలంలోని మొల్గర, సదగోడు సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక ట్రాక్టర్లు ప్రతి రోజు నడుస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు.



పట్టుబడిన మట్టి టిప్పరు, ఇసుక ట్రాక్టర్లు

బండలాగుడు పోటీల అడ్డగింత



పోలీసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భరతసింహారెడ్డి

గట్టు: మండలంలోని ఆలూరులో ఆంజనేయ స్వామి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలను పోలీసులు అడ్డుకోవడం వివాదాస్పదంగా మారింది. జాతర సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు క్రికెట్ టోర్నమెంట్, బీజేపీ నాయకులు బండలాగుడు పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 17 జతల ఎద్దులు ఆలూరుకు చేరుకున్నాయి. అయితే శనివారం పోటీలను ప్రారంభించే క్రమంలో గట్టు ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో వచ్చి బండలాగుడు పోటీలు ఆపాలని కోరారు. దీంతో బీజేపీ నాయకులు గద్వాల మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డికి సమాచారం ఇవ్వగా ఆయన అక్కడికి పోటీలను ప్రారంభించేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు మరోసారి అడ్డుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఉద్దేశ పూర్వకంగానే బండలాగుడు పోటీలను అడ్డుకున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ విషయమై ఎస్ఐ స్పందిస్తూ బండలాగుడు పోటీలు నిర్వహించే స్థలం కోర్టు వివాదంలో ఉన్నందున అభ్యంతరం చెప్పామని, అనుమతులు తీసుకుని మరోచోట నిర్వహించుకుంటే తమకెలాంటి అభ్యంతరం చెప్పారు. మొత్తంగా బండలాగుడు పోటీలు నిర్వహించకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎద్దుల యజమానులు నిరాశతో వెనుదిరిగారు.

ఆకస్మికంగా రైతు మృతి

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లిలో వ్యవసాయ పొలంలో ఎరువులు చల్లడానికి వెళ్లిన రైతు ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన బండారి బుచ్చన్న(59) శనివారం మధ్యాహ్నం తన వ్యవసాయ పొలంలోని కరిగెటలో ఎరువులు చల్లడానికి వెళ్లాడు. పొలం వద్దనే బహిర్భూమికి వెళ్లిన బుచ్చన్న కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్దిసేపటి తర్వాత పెద్ద కుమారుడు కురుమూర్తి ఎరువులను తీసుకుని పొలం వద్దకు వెళ్లాడు. కుప్పకూలిన తండ్రిని చూసి వెంటనే కొత్తకోటలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య కుర్మక్క, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇంటి నుంచి పొలం వద్దకు వెళ్లిన రైతు విగతజీవిగా ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీరని విషాదంలో మునిగిపోయారు.

పత్తి పంట తొలగించుకోండి



కోత కోసిన పత్తి పంట

అలంపూర్: బీటీ సాంకేతిక పరిజ్ఞానం రాక ముందు పత్తిని వివిధ రకాల కాయతొలుచు పురుగులు ఆశించి నష్టపరిచాయి. 2002లో వచ్చిన బీటీ సాంకేతిక పరిజ్ఞానంతో కాయ తొలుచు పురుగుల ఉధృతి తగ్గిందని ఏడీఏ సక్రీయ నాయక్ తెలిపారు. ప్రస్తుతం పత్తి సాగు పూర్తి కావడంతో పొలాల్లో పంటను తొలగించాలని సూచించారు. పత్తి పంట తొలగించిన తీసుకోవాల్సిన చర్యలపై ఆయన రైతులకు వివరించారు.

గులాబీ పురుగు

గులాబీ రంగు తల్లి పురుగు లేత ఆకుల కింది భాగాన లేత కొమ్మలపై, పూమొగ్గలపైన, లేత కాయాలపైన గుడ్లను విడివిడిగా 150 నుంచి 200 వరకు పెడుతుంది. గుడ్ల నుంచి పొదగబడిన పిల్ల పురుగులు పూ మొగ్గలోకి తొలుచుకొని పోయి లోపలి పదార్థాలను తిని వీటిని గుడ్డి పూలుగా మారుస్తాయి. చిన్న లార్వాలు కాయలకు కనిపించనంత చిన్న రంధ్రాలు చేసి లోనికి ప్రవేశిస్తాయి. తర్వాత కాయలకు చేసిన రంధ్రాలు పూడిపోయి పురుగు కాయలోనే ఉండి గింజలను తింటూ దూదిని బాగా నష్టపరుస్తుంది. దూది రంగు, నాణ్యత పూర్తిగా దెబ్బతినడమే కాకుండా దూది బరువు తగ్గుతుంది. పురుగు లార్వా దశ మొత్తం కాయలోనే గడపడం వలన కాయ పగిలిన తర్వాతనే నష్టాన్ని గుర్తించగలం. పురుగులు ఆశించిన కాయలు పూర్తిగా వృద్ధి చెందక త్వరగా పక్వానికి వస్తాయి.

నివారణ చర్యలు

సమగ్ర యాజమాన్య పద్ధతులు అనుసరించి గులాబీ రంగు పురుగును సమర్థవంతంగా నివారించుకోవచ్చు. ప్రధానంగా పంట తీసిన తర్వాత పంట లేని సమయాన, విత్తడానికి ముందు, పంట కాలంలో వివిధ చర్యలు చేపట్టాలి.

పంట తీసిన తర్వాత చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు

పంట తీసిన తర్వాత చేనులో గొర్రెలు, మేకలు, పశువులను మేపాలి. పత్తి మోళ్లను ట్రాక్టర్ రోటోవేటర్‌తో భూమిలో కలియ దున్నాలి. నీటి వసతి ఉన్నప్పటికీ పత్తిని 6నెలలు మించి పొడగించకుండా తీసి వేయాలి. పంట కాలం పొడగించుట ద్వారా రాబోయే పంటలో పురుగు ఉధృతి పంట తొలి దశలోనే ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. నీటి వసతి ఉన్న చోట రెండవ పంటగా ఆరుతడి పంటల్ని సాగు చేసుకోవాలి. పత్తి మోళ్లను ఇళ్ల వద్ద పొయ్యిలో వాడేందుకు నిల్వ చేయకూడదు. పత్తి తీసిన తర్వాత ఎండిన మోళ్లను విచ్చుకోని కాయలను భూమిలో కలియ దున్నుట ద్వారా పురుగు కోశస్థ దశలను నాశనం చేయవచ్చును.

పత్తి విత్తడానికి ముందు, పంట కాలంలో..

పంట మార్పిడి పద్ధతిని రెండు లేక మూడు సంవత్సరాలకు ఒకసారి విధిగా పాటించాలి. తక్కువ కాల పరిమితిగల రకాలను ఎంపిక చేసుకుని సకాలంలో విత్తుకోవడం ద్వారా గులాబీ రంగు పురుగు ఉధృతిని తగ్గించవచ్చు. బీటీ పత్తి విత్తే సమయాల్లో చుట్టూ 5 వరుసల్లో నాన్ బీటీ పత్తిని విధిగా విత్తుకోవాలి. పత్తి పొలం, చేను చుట్టూ తుత్తురు బెండలాంటి కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. పత్తి పంట దగ్గరలో బెండ పంట ఉండరాదు. పత్తి పంట విత్తిన 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించడానికి ఎకరాకు 4 నుంచి 8 లింగాకర్షక బుట్టలను అమర్చి వరుసగా బుట్టలలో మూడు రోజులు 7 లేదా 8 తల్లి పురుగులు పడటం గమనిస్తే, 10 శాతం గుడ్డి పువ్వులు లేదా 10 శాతం పురుగు ఆశించిన కాయలను గమనించిన వెంటనే సస్యరక్షణ చేపట్టాలి. గులాబీ రంగు పురుగు ఆశించిన గుడ్డి పూలను ఏరి నాశనం చేయాలి. పురుగు ఉధృతి ఆర్థిక నష్ట పరిమితి స్థాయి దాటిన వెంటనే నివారణకు మందులు పిచికారి చేసుకోవాలి. 5 శాతం వేప గింజల కషాయం లేదా 5 మి.లీ (1,500 పీపీఎం) వేప నూనెను లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. క్వినాల్‌ఫాస్ 2.0 లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ. లేదా కోరోఫైరిఫాస్ 2.5. మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పంట కాలంలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే సింథటిక్ పైరిత్రాయిడ్ మందులైన సైపర్‌మెత్రిన్ 25 శాతం ఇ.సీ ఒక మి.లీ లేదా లామ్డాసైహాలోత్రిన్ 5 శాతం ఇ.సి 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవచ్చు. సింథటిక్ పైరిత్రాయిడ్ మందులు పత్తి పంటపై ఎక్కువ సార్లు పిచికారి చేసినట్లయితే రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉంది.

పంట లేని సమయాల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు

ఎండాకాలంలో లోతు దుక్కులు చేసుకోనుట ద్వారా పురుగు యొక్క కోశస్థ దశలను సమర్థవంతంగా నాశనం చేయవచ్చు. గులాబీ రంగు ఆశించిన పత్తిని జిన్నింగ్ చేయగా వచ్చిన విత్తనాలను నిల్వ చేయకుండా నాశనం చేయాలి. లేకుంటే తర్వాత పంట కాలంలో దీని ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. గులాబీ రంగు ఆశించిన పత్తిని రైతుల ఇళ్ల వద్దగాని లేదా జిన్నింగ్ మిల్లుల వద్దగాని నిల్వ ఉంచరాదు.

క్లుప్తంగా

నేడు ఆవిర్భావ దినోత్సవం



అలంపూర్: మాలల చైతన్య సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని సమితి నియోజకవర్గ అధ్యక్షుడు రజనిబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో మాలల చైతన్య సమితి 7వ ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్డులో ఉన్న ఎస్సీ కమ్యూనిటీలో ఈనెల 8న ఉదయం 10గంటలకు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మాలల చైతన్య సమితి నాయకులు, ఉద్యోగులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రవికుమార్, లక్ష్మణ్, ప్రవీణ్, చందు, అక్షయ్, అంజి, నరేష్, విజయ్, రాజేష్, శివ, నారి పాల్గొన్నారు.

12న వైద్యశిబిరం

ధరూరు (కేటీదొడ్డి): వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈనెల 12న కేటీదొడ్డి మండల కేంద్రంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పురావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ గద్దె భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన కిమ్స్, సన్‌షైన్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో గుండె, ఎముకలు, నరాలకు సంబంధించిన నిపుణులైన డాక్టర్లచే ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 2డీ ఈకో, ఈసీజీ, షుగర్ పరీక్షలతో పాటు స్త్రీ సంబంధ వ్యాధులకు పరీక్షలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నోటు పుస్తకాల అందజేత

అయిజ: పట్టణంలోని భరత్‌నగర్ పాఠశాలలో పాఠశాల చైర్మన్ అశ్వమారెప్ప కుమారుడు వీరేష్ పుట్టినరోజు సందర్భంగా శనివారం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బసన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయండి

అయిజ: నేషనల్ యూత్ డే (స్వామి వివేకానంద జయంతి)ని పురస్కరించుకొని సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మడల స్థాయి యూత్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాలీబాల్, రన్నింగ్, లాంగ్‌జంప్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆదివారం సాయంత్రం వరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా కేంద్రంలో నిర్వహించే క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్‌ఐ కోరారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

గట్టు: చిన్నోనిపల్లె భూ నిర్వాసిత రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు మొరుగు వీరేష్ డిమాండ్ చేశారు. శనివారం చిన్నోనిపల్లె నిర్వాసితులు చేస్తున్న ఆందోళన శిబిరాన్ని మొరుగు వీరేష్ సందర్శించారు. ఈ సందర్భంగా మొరుగు వీరేష్ మాట్లాడుతూ ఆయకట్టు లేకుండానే చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నారని, ఎవరికీ ఏ ఉపయోగం లేని రిజర్వాయర్‌ను రద్దు చేయాలని కోరారు. 350 రోజులు ఐదు గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రెండో విడత గొర్రెలు ఇప్పించండి

శాంతినగర్: యాదవులకు రెండో విడత గొర్రెలు పంపిణీ చేసి న్యాయం చేయాలని యాదవ సంఘం నాయకుడు కొంకల అమర్ యాదవ్ మంత్రులను కోరారు. హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో శ్రీకృష్ణయాదవ భవన్ భవన్ నిర్మాణ పనుల సందర్శనలో భాగంగా అన్ని జిల్లాల్లోని యాదవ సంఘం నాయకుల సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. సమావేశానికి వడ్డేపల్లి మండల పరిధిలోని కొంకలకు చెందిన అమర్‌యాదవ్ పాల్గొన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ, యాదవుల సమస్యల గురించి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, రజ్యసభ సభ్యుడు లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్‌లను కలిసి విన్నవించినట్లు తెలిపారు.

ముగ్గుల పోటీలు



అయిజ: పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తుగా సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆయకట్టు రైతుల ఆనందం

- నెట్టెంపాడు జలాలతో చెరువుల కింద ఏటా పెరుగుతున్న సాగు
- నిండు కుండలను తలపిస్తున్న చెరువులు



ధరూరు చెరువు కింద సాగైన వరి పంట



నెట్టెంపాడు జలాలతో నిండిన మన్నాపురం చెరువు

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథక పుణ్యమా అంటూ మండలంలోని చెరువులు, కుంటలు నిండు కుండలను తలపిస్తున్నాయి. వాటి కింద ఉన్న ఆయకట్టుకు సమృద్ధిగా సాగు నీరందడంతో రైతులు పంటలను సాగు చేసుకుంటున్నారు. సాగు లేక బీడుగా మారిన చెరువు కింది ఆయకట్టుకు పూర్వ వైభవం కనిపిస్తోంది. వరుణ దేవుడిపై దయతో సాగయ్యే ఆయకట్టు నేడు వర్షాలతో సంబంధం లేకుండా నెట్టెంపాడు జలాలతో బీడు భూములు సాగులోకి వస్తున్నాయి.

చెరువులకు జలకళ..

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన ర్యాలంపాడు, గుడ్డెందొడ్డి రిజర్వాయర్లను వరదల సమయాల్లో నింపుతున్నారు. తదనంతరం నీటిని కాల్వల ద్వారా చెరువులు నింపే ప్రక్రియను ఆరేళ్లుగా కొనసాగిస్తున్నారు. పూర్తి స్థాయిలో చెరువును నింపడంతో రైతులు చెరువు కింద ఉన్న ఆయకట్టును సాగులోకి తెస్తున్నారు. ఒక పంటకు పూర్తి స్థాయిలో నీరండంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఇలా..

మండలంలోని ర్యాలంపాడు చెరువు నుంచి ఓబులోనిపల్లి, బూరెడ్డిపల్లి చెరువులతో పాటు అక్కడి నుంచి ధరూరు చెరువులకు నీటిని విడుదల చేసి నింపుతున్నారు. ఇక్కడి నుంచి అలుగు పారుతున్న నీరు గద్వాల మండలం సంగాల చెరువుకు చేరుకుంటోంది. ఒక్క ధరూరు పెద్ద చెరువు కిందనే దాదాపు 300 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతోంది. మండలంలోని ఆయా గ్రామాల చెరువుల కింద దాదాపు వెయ్యి ఎకరాల వరకు సాగవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు నెట్టెంపాడు ప్రధాన కాల్వ వెంట ఉన్న మన్నాపురం చెరువును నింపి అక్కడి నుంచి అలుగు నీటితో సోంపురం, పారుచర్ల, పెద్దపాడు చెరువులను నింపారు. వీటితో పాటు మండల పరిధిలోని కోతులగిద్ద, ఉప్పేరు, మార్లబీడు, అల్వలపాడు, కొత్తపాలెం, జాంపల్లి, దోర్నాల తదితర గ్రామాల చెరువులను ఏటా నింపి రైతులకు సాగు నీరందిస్తున్నారు. రెండు పంటలకు సాగు నీరందుతుండడంతో చెరువు కింది ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గుడ్డెందొడ్డి రిజర్వాయర్ కింద ఉన్న చెరువులను దాదాపుగా నింపుతున్నారు.

పంటల సాగు..

మండలంలో మొత్తం 55 చెరువులు ఉన్నాయి. మిషన్ కాకతీయ పనులు చేపట్టిన చెరువులకు దాదాపుగా నెట్టెంపాడు జలాలు అందుతున్నాయి. అందులో దాదాపు 30 చెరువులకు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం నీటిని విడుదల చేసి చెరువులను నింపుతున్నారు. గత ఏడాది యాసంగిలో 1,956 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఈ ఏడాది వానాకాలంలో 2,390 ఎకరాల్లో, ప్రస్తుతం యాసంగి సాగు కొనసాగుతోంది. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా సాగు అయ్యే అవాకాశాలు ఉన్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు.

చెరువు నీటితో పంటలు సాగు చేస్తున్నాం..



ధరూరు పెద్ద చెరువు కింద కొంత వ్యవసాయ పొలం ఉంది. వరిని సాగు చేశా. ఐదారేళ్లుగా చెరువును నింపుతుండడంతో చెరువు కింద ఉన్న పంటలు సాగు చేసుకుంటున్నాం. నెట్టెంపాడు జలాలతో చెరువును నింపడంతో సాగు షురూ చేసాం.

– గోపిరెడ్డి, రైతు, ధరూరు

నీటిని వృథా చేయొద్దు..



మండలంలోని చెరువులకు నెట్టెంపాడు జలాలతో నింపుతున్నాం. చెరువు కింది ఆయకట్టుకు రెండు పంటలకు సాగు నీరందిస్తున్నాం. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు సాగు నీటిని మొతాదుకు మించి వాడుకుని వృథా చేయవద్దు.

– వినయ్, ఏఈ ఇరిగేషన్ శాఖ

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చింత సాంబమూర్తి

శాంతినగర్: తెలంగాణలో బీజేపీ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చింత సాంబమూర్తి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలంపూర్ నియోజకవర్గ కన్వీనర్ మెడికల్ తిరుమల్‌రెడ్డి అధ్యక్షతన శాంతినగర్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో నియోజకవర్గ పోలింగ్‌బూత్ నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి చింత సాంబమూర్తి హాజరై మాట్లాడారు. తెలంగాణలో గెలుపే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఒకేరోజు పోలింగ్‌బూత్ కమిటీల సమావేశాలు నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రతి పోలింగ్ బూత్‌లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలని అన్నారు. సమావేశంలో అసెంబ్లీ ఇన్‌చార్జ్ సబ్బిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు రాజగోపాల్, బంగి లక్ష్మణ్, మాదన్న, మధుసూదన్‌గౌడ్, కృష్ణస్వామి పాల్గొన్నారు.

మరమ్మతు పనులు వేగవంతం చేయండి



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

అయిజ: బస్తీ దవాఖాన కోసం ఏర్పాటు చేస్తున్న పాఠశాల పాత భవనం మరమ్మతు పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అన్నారు. పట్టణంలోని సంతబజార్‌లో ఏర్పాటు చేస్తున్న బస్తీ దవాఖాన భవనం మరమ్మతు పనులను మున్సిపల్ కమిషనర్ నర్సయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. బస్తీ దవాఖాన మరమ్మతు పనులు 90శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఫ్లోరింగ్ పనులు, పెయింటింగ్ పనులు పూర్తిచేసి త్వరలో ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో చేపట్టిన మిషన్ భగీరథ, సీసీరోడ్డు నిర్మాణం పనులను మున్సిపల్ కమిషనర్ ఏఈ గోపాల్‌తో కలిసి పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, నిబంధనల మేరకు సకాలంలో పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీపీ మనోరమ

ధరూరు (కేటీదొడ్డి): ప్రభుత్వం ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మనోరమ అన్నారు. శనివారం కేటీదొడ్డిలోని రైతువేదికలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అందరూ సమన్వయంతో పనిచేసి నియోజకవర్గంలో 100శాతం కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, ఎంపీడీఓ మహ్మద్ అజార్ యొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు



గట్టులో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం టీఎస్ యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను సంఘం జిల్లా అధ్యక్షుడు తిప్పన్న, హెచ్‌ఎం చెన్నయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. జనవరి 13, 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర మహాసభలకు అధికసంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయప్రకాశ్, వెంకటస్వామి, చంద్రశేఖర్, రమేష్, శ్రీను, మద్దిలేటి, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అయిజ: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ సాయిప్రకాష్, ఇన్‌చార్జ్ ఎంఈఓ నరసింహ చేతుల మీదుగా టీఎస్ యూటీఎఫ్ నాయకులు సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ప్రణీత, లక్ష్మణ్, హనుమంతురెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, నరసింహులు, ప్రశాంత్ బాబు, హెచ్‌ఎం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్ యుటీఎఫ్ క్యాలెండర్‌ను శనివారం ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుందర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మద్దిలేటి, వెంకట్రాముడు, గరీబ్ భాషా, సురేష్, సుధాకర్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో..

గట్టు: పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్‌ను శుక్రవారం గట్టులో ఎంఈఓ కొండారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు రంగన్న, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం నర్సింహులు, ఓబులేష్, రుక్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

అలంపూర్: ప్రభుత్వం రీసోర్స్‌పర్సన్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని మండల రీసోర్స్‌పర్సన్లు ఎమ్మెల్యే అబ్రహంను కోరారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో అలంపూర్ మండల రీసోర్స్‌పర్సన్లు(ఆర్‌పీ) శనివారం ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహంను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలోని మెప్మా ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్స్‌లుగా, మహిళా సంఘాలతో పొదుపు, అంతర్గత రుణాలు, శ్రీనిధి రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకెళ్లడంతో ఆర్‌పీలు సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. కనీస వేతనం రూ.18వేలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలని కోరారు.

చెన్నకేశవస్వామి జాతర



మానవపాడు: మండలంలోని బోరవెల్లిలో శనివారం చెన్నకేశవస్వామి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులు పెద్దసంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా గ్రామంలో క్రికెట్, కబడ్డీ పోటీలను గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఎడ్ల బండ్ల గిరక పోటీలను ప్రారంభిస్తున్న రామకృష్ణారెడ్డి

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన ఆలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్దకల్ స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతా రామస్వామి, చర్లగార్లపాడు వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు రమేషాచారి, మధుసూధనాచారి, రవిచారిలు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యశ్చంద్రారెడ్డి నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్లబండ్ల గిరక పోటీలు

గట్టు: మండలంలోని సల్కాపురంలో నిర్వహిస్తున్న గోకరమయ్య ఉర్సు సందర్భంగా శనివారం ఎడ్ల బండ్ల గిరక పోటీలను నిర్వహించారు. మూడు బండ్ల గిరక పోటీలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 8 జతల ఎడ్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బజారి, రామునాయుడు, ఈరన్న, వెంకటేష్, సంతోష్, వెంకటన్న, గోవిందు, రంగస్వామి, నరేష్, నవీన్‌చారి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. శనివారం బైరాపురం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవంలో భాగంగా డీఈఓగా అరుద్ర నాయుడు, ఎంఈఓగా షేక్షావలి, ఉపాధ్యాయులుగా విద్యార్థులు పాఠాలు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ధరూరు: కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంజిపేట రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో నాన్ టీచింగ్ స్టాఫ్‌తో సమావేశమై మాట్లాడారు. నాన్ టీచింగ్ స్టాఫ్ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. వెట్టి చాకిరిలా పనులు చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఈనెల 11న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ స్టాఫ్ ప్రథమ మహాసభలకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శశికళ, నాన్ టీచింగ్ స్టాఫ్ అసోసియేషన్ సభ్యులు తిరుపతమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో వృద్ధులు, ఒంటరి మహిళలకు శనివారం ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. న్యాయవాది వరలక్ష్మీ దేవి హాజరై దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసి మాట్లాడారు. సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఓఎంఎఫ్ సంస్థ హెల్త్ వర్కర్ ప్రమీల, అంగన్‌వాడీ టీచర్ అరుణ, ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గిరిబాబు తదితరులు ఉన్నారు.



నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న పోలీసులు

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో తల్లితండ్రులను కోల్పోయిన ముగ్గురు పిల్లలకు అండగా ఎస్పీ రంజన్ రతన్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు ఆర్థికసాయం అందజేశారు. శనివారం కంచుపాడులో ముగ్గురు అనాథ పిల్లలకు, మీ కోసం మేము సైతం, సోషల్ రెస్పాన్సిబులిటీ టీం సభ్యులు ఆరు నెలలకు సరిపడా రూ.17,500ల విలవ గల నిత్యావసర సరుకులు, రూ.10వేల నగదు, రెండు జతల బట్టలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాల్‌రాజు, సైబర్ సెల్ ఎస్‌ఐ రజిత, ఏఎస్‌ఐ దేవరాజు, ఐటీ సెల్ ఇన్‌చార్జ్ నాగరాజు, పీఆర్‌ఓ సురేష్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో గద్వాల, ధరూరు మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, గ్రంథాలయ చైర్మన్ రామన్‌గౌడ్, ఎంపీపీ విజయ్, నాయకులు హనుమంతురెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం..

గట్టు: మండలంలోని ఆలూరు శ్రీ ఆంజనేయ స్వామి రథోత్సవాన్ని శుక్రవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆలూరుకు చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి రథోత్సవంలో పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా చిన్నారుల దేవతల వేషధారణ ఆకట్టుకుంది. క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లమ్మ, ఎంపీటీసీ ఆనంద్‌గౌడ్, ఎంపీపీ విజయ్‌కుమార్, కేటీదొడ్డి జెడ్పీటీసీ రాజశేఖర్, బీఆర్ఎస్ నాయకులు రాముశెట్టి, గద్వాల తిమ్మప్ప, గోవిందు పాల్గొన్నారు.

సంస్కృతిని కాపాడుకోవాలి..

ధరూరు (కేటీదొడ్డి): కేటీదొడ్డి మండలంలోని ఇర్కిచేడులో జంగిల్ సాబ్ ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి గ్రామంలో నిర్వహించిన నాటక ప్రదర్శనలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో సాంకేతికత ఎంతగానో అభివృద్ధి చెందుతోందని, అదే తరుణంలో ప్రాచీన సంస్కృతిని కాపాడుకోవడం నేటి యువత మరిచిపోతోందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మార్కెట్ యార్డు డైరెక్టర్ భగవంతు, నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్, వెంకటన్న గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు సేకరించాలి

గట్టు: బడి బయటి పిల్లల వివరాలను ఉపాధ్యాయులు సేకరించాలని ఎంఈఓ కొండారెడ్డి కోరారు. శనివారం ఎంఈఓ కార్యాలయంలో మండల స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కొండారెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ పాఠశాలల పరిధిలో 6 నుంచి 14 ఏళ్ల, 14 నుంచి 19 ఏళ్ల వయస్సు బడిబయటి పిల్లల వివరాలను సేకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎన్‌ఓ నర్సింహులు, హెచ్‌ఎం ఓబులేష్ ఉన్నారు.

క్లుప్తంగా...

మార్చి 5న ఏఈ అర్హత పరీక్ష

సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఫిబ్రవరి 12వ తేదీన జరగాల్సిన అర్హత పరీక్షను వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. ఆ రోజు గేట్ పరీక్షలు జరగనున్నట్లు అభ్యర్థులు విన్నవించడంతో పరీక్ష తేదీని వాయిదా వేయాలని కమిషన్ నిర్ణయించింది. మార్చి 5వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది.

టీచింగ్ సిబ్బందిని నేరుగా నియమించండి

ఆయుర్వేద వైద్య కళాశాలపై కేసులో సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో టీచింగ్ పోస్టులను నేరుగా భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బోధనేతర సిబ్బందిని టీచింగ్ పోస్టుల్లో భర్తీ చేయడాన్ని ఆపాలని స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆయుర్వేద వైద్య సర్వీసుల నిబంధనలను మారుస్తూ ఖాళీ పోస్టులను నేరుగా భర్తీ చేయకుండా..అంతర్గత బదిలీలు చేయడాన్ని ఆపాలని కోరుతూ వరంగల్ జిల్లాకు చెందిన డాక్టర్ నీలిమాతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాదాపు 18 ఏళ్లుగా ఆయుర్వేద కళాశాలలో టీచింగ్ పోస్టులను నేరుగా భర్తీ చేయడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. వైద్యారోగ్య ముఖ్య కార్యదర్శితో పాటు మరో 17 మందిని ప్రతివాదులుగా చేర్చారు. వాదనలు విన్న సీజే ధర్మాసనం..నాన్ టీచింగ్ కేడర్ ఉద్యోగులను టీచింగ్‌లో భర్తీ చేయడాన్ని తప్పుబట్టింది. ఈ బదిలీలకు సంబంధించిన ఆర్డర్‌ను సస్పెన్షన్‌లో పెట్టిన ధర్మాసనం..నేరుగా భర్తీ చేయాలని సూచించింది.

జేఎల్ నోటిఫికేషన్‌లో వయో పరిమితి పెంచండి

సాక్షి, హైదరాబాద్: జూనియర్ లెక్చరర్ (జేఎల్) నియామకపు నోటిఫికేషన్‌లో ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కేటగిరీలకు వయో పరిమితి 52 ఏళ్లకు పెంచాలని తెలంగాణ (కాకతీయ) ప్రైవేటు కాలేజీ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంకేపల్లి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా జేఎల్ నోటిఫికేషన్ లేకపోవడంతో అనేకమంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం చూస్తున్నారని, ప్రస్తుతం ఇచ్చిన నోటిఫికేషన్‌కు దరఖాస్తు చేద్దామంటే వయో పరిమితి దాటిపోవడంతో నోటిఫికేషన్ అర్హత సాధించలేకపోతున్నారని ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

వెండి చీరను ఆవిష్కరించిన కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల నేత కళాకారుడు నల్లా విజయ్ మగ్గంపై నేసిన సువాసనలు వెదజల్లే వెండి చీరలను మంత్రి తారక రామారావు శనివారం ఆవిష్కరించారు. చీర తయారీకి దాదాపు నెలన్నర రోజుల సమయం పట్టిందని విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ఇప్పటి వరకు విజయ్ నేసిన వస్త్ర ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు అతని కళా నైపుణ్యాన్ని ప్రశంసించారు. తెలంగాణ నేతన్నల అనితర సాధ్యమైన, అద్భుతమైన ప్రతిభకు విజయ్ నిదర్శనమని, ఆయన సిరిసిల్లకు మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజయ్‌కు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు.


నల్లా విజయ్ మగ్గంపై నేసిన వెండి చీరను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

ఇక్కడ డిపాజిట్ల కంటే రుణాలు ఎక్కువ

- తెలంగాణలో బ్యాంకుల పనితీరు భేష్: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి
- కేంద్ర పథకాలతో పేదల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం
- వివిధ వర్గాలకు బ్యాంకుల నుంచి విస్తృతంగా ఆర్థిక సాయం
- ప్రధాని మోదీ ఆలోచనలతో డిజిటల్‌ఇండియా
- రాష్ట్ర ప్రభుత్వం త్వరగా రైతు రుణమాఫీ చేయాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని బ్యాంకులు బాగా పనిచేస్తున్నాయని.. డిపాజిట్ల కంటే ఎక్కువగా రుణాలు ఇవ్వడం మంచి పనితీరుకు నిదర్శమని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టాక బ్యాంకుల ప్రాధాన్యం బాగా పెరిగిందని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని కోఠి స్టేట్‌బ్యాంకులో రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో కిషన్‌రెడ్డి సమావేశమయ్యారు. కేంద్రం అమలు చేస్తున్న వివిధ పథకాలకు బ్యాంకులు లోన్లు ఎలా మంజూరు చేస్తున్నాయనే దానిపై సమీక్షించారు.



తర్వాత మీడియాతో మాట్లాడారు. దేశంలోని పేద ప్రజల్లో ఆత్మ విశ్వాసం పెంచేలా ప్రధాని మోదీ జన్‌ధన్‌ఖాతాలు తెరిపించారని, ఆ ఖాతాల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలు దళారుల దోపిడీ లేకుండా నేరుగా అమలవుతున్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయ రుణాలు 2020–21లో రూ.40,564 కోట్లు, 2021–22లో రూ.42,853 కోట్లు ఇచ్చారని.. 2022–23లో రూ.40,718 కోట్లు లక్ష్యంకాగా.. ఇప్పటివరకు 58.43 శాతం రుణాలు ఇచ్చారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా వ్యవసాయ రుణమాఫీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు సహకరించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.

ఇక్కడ బ్యాంకుల క్రెడిట్ రేషియో ఎక్కువ

రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల్లో కలిపి రూ.6,32,834 కోట్ల డిపాజిట్లు ఉంటే.. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా డిపాజిట్ల కన్నా ఎక్కువగా రూ.7,25,568 కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. తెలంగాణ క్రెడిట్, డిపాజిట్‌రేషియో దేశంలోనే ఎక్కువగా 114.65 శాతంగా ఉందని తెలిపారు. ఇది బ్యాంకుల పనితీరుకు అద్దం పడుతోందని ప్రశంసించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాల్లో రాష్ట్రంలోని అన్ని బ్యాంకులు ఆయా ప్రాధాన్య రంగాలకు రూ.84,143 కోట్ల రుణాలు ఇచ్చాయని.. అందులో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ.38,737 కోట్లు మంజూరు చేశాయని వివరించారు. ప్రధాన మంత్రి ముద్రా యోజన, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్‌జనరేషన్‌ప్రోగ్రామ్ (పీఎంఈజీపీ), పీఎం స్వానిధి పథకాల కింద ఆయా వర్గాలకు బ్యాంకుల నుంచి గణనీయంగా ఆర్థిక సాయం అందినట్టు కిషన్‌రెడ్డి తెలిపారు. వీధి వ్యాపారులకు పెద్ద ఎత్తున కేంద్ర సాయం అందించడం గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం కింద బ్యాంకులు 62,516 గృహ నిర్మాణాలకు రుణాలు మంజూరు చేశాయని, లబ్ధిదారులు రూ.1,427.72 కోట్లు సబ్సిడీగా పొందారని చెప్పారు. కాగా.. రాష్ట్రంలో రుణమాఫీ కింద ఎంత మంది రైతులకు, ఎన్ని కోట్ల మేర లబ్ధి అందిందనే వివరాలను కిషన్‌రెడ్డి తెలుసుకున్నట్టు సమాచారం.

కొత్త మెడికల్ కాలేజీలు | త్వరగా పూర్తి కావాలి

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- 13 డయాగ్నొస్టిక్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలి
- ఆసుపత్రులకు మందుల సరఫరాలో పరిమితి ఉండకూడదు
- వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలి
- ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష


వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న తొమ్మిది వైద్య కళాశాలల పనులను వేగవంతం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఉన్నతాధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయం నుంచి నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్.హెచ్.ఎం), తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య కళాశాలల పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలన్నారు. గత ఏడాది 8 మెడికల్ కాలేజీలను ఒకేసారి ప్రారంభించి రికార్డు సృష్టించామని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేయనున్న కరీంనగర్, ఖమ్మం, కామారెడ్డి, వికారాబాద్, జనగామ, నిర్మల్, భూపాలపల్లి, సిరిసిల్ల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని కాలేజీల్లో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ వైద్య మండలి బృందం పరిశీలనకు వచ్చేనాటికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు.

మాతా, శిశు కేంద్రాలను త్వరగా పూర్తి చేయాలి..

నిర్మాణంలో ఉన్న మాతా, శిశు సంరక్షణ కేంద్రాలను త్వరగా పూర్తి చేయాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. నిమ్స్, గాంధీ ఆసుపత్రుల ఆవరణల్లో నిర్మిస్తున్న మాతా, శిశు కేంద్రాలను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అలాగే వివిధ జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేయనున్న 13 తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్లను వీలైనంత వేగంగా అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చురీల పనులు, 12 సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్‌ల పనులను కూడా మంత్రి సమీక్షించారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల సమీపంలో తొమ్మిది క్రిటికల్ కేర్ హాస్పిటల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందించేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కాగా, అన్ని ఆసుపత్రుల్లో సరిపడా మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. మందుల సరఫరాలో ఎలాంటి నియంత్రణ ఉండవద్దని, అవసరమైన మేరకు మందులను ఆయా ఆసుపత్రులకు సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించి, 24 గంటల్లోగా పరీక్ష ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. ఆసుపత్రుల్లో వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చూసుకోవడం సూపరింటెండెంట్ల బాధ్యత అని స్పష్టంచేశారు. ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తూ వైద్య పరికరాలు సమకూర్చుతోందని, ఈ నేపథ్యంలో అవి ప్రజలకు పూర్తిస్థాయిలో సద్వినియోగపడేలా చూడాలని చెప్పారు.

‘సెట్’ కన్వీనర్లను ఖరారు చేసిన టీఎస్‌సీహెచ్‌ఈ!

- ఎంసెట్ నిర్వహణ బాధ్యత జేఎన్‌టీయూకు... కన్వీనర్‌గా బి.డీన్‌కుమార్
- మొత్తం ఏడు సెట్‌లకు కన్వీనర్ల ఎంపిక పూర్తి

సాక్షి, హైదరాబాద్: వచ్చే విద్యా సంవత్సరం (2023–24)లో వృత్తి విద్యా కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి నిర్వహించే సాధారణ ప్రవేశ పరీక్ష (సెట్)ల నిర్వహణ బాధ్యతలు, కన్వీనర్ల ఎంపిక ప్రక్రియను తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పూర్తి చేసింది. ప్రధానంగా ఏడు రకాల సెట్లకు సంబంధించి యూనివర్సిటీలు, కన్వీనర్ల ఎంపికపై తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వివిధ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్‌లర్లతో సమావేశం నిర్వహించారు. టీఎస్‌ఎంసెట్‌ను జేఎన్టీయూ నిర్వహించనుండగా... కన్వీనర్‌గా ప్రొఫెసర్ బి.డీన్‌కుమార్ నియమితులయ్యారు.

వీటితో పాటు మరో ఆరు సెట్లకు కన్వీనర్ల జాబితాను టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ప్రకటించారు.

సెట్-23	యూనివర్సిటీ	కన్వీనర్
టీఎస్ ఎంసెట్	జేఎన్‌టీయూహెచ్	బి.డీన్‌కుమార్
టీఎస్ పీజీఈసెట్	జేఎన్‌టీయూహెచ్	బి.రవీందర్‌రెడ్డి
టీఎస్ఐసెట్	కేయూ	పి.వరలక్ష్మి
టీఎస్ఈసెట్	ఓయూ	శ్రీరాం వెంకటేశ్
టీఎస్‌లాసెట్,పీజీఎల్‌సెట్	ఓయూ	బి.విజయలక్ష్మి
టీఎస్ ఎడ్‌సెట్	ఎంజీయూ	ఏ.రామకృష్ణ
టీఎస్ పీఈసెట్	శాతవాహన	రాజేశ్ కుమార్



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల | నిర్మాణాలకు టెండర్లు ఖరారు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణాల ప్రక్రియ మరో అడుగు ముందుకు పడింది. ఈ ఆస్పత్రుల నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. ఎల్‌బీనగర్, అల్వాల్, సనత్‌నగర్‌లో నిర్మించే మూడు ఆస్పత్రులకు నిర్మాణ సంస్థలను ఎంపిక చేసింది. ఈ మూడు ఆస్పత్రుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.2,679 కోట్లు అంచనా వేసింది. ఈమేరకు టెండర్లు పిలవగా....రూ.2,004 కోట్లతో నిర్మాణాలు పూర్తి చేయనున్నట్లు కాంట్రాక్టు సంస్థలు ధరలు ప్రకటించాయి. అత్యంత తక్కువ ధరలు ప్రకటించిన సంస్థలకు ప్రభుత్వం నిర్మాణ బాధ్యతలు అప్పగించనుంది.

ప్రాజెక్టు	ప్రభుత్వ అంచనా	కాంట్రాక్టు సంస్థ	నిర్మాణ వ్యయం
టీఐఎంఎస్ ఎల్‌బీనగర్, రంగారెడ్డి జిల్లా	900.00 కోట్లు	లార్సన్ అండ్ టూబ్రో లిమిటెడ్	668 కోట్లు
టీఐఎంఎస్ సనత్‌నగర్, హైదరాబాద్ జిల్లా	882.00 కోట్లు	మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా	667 కోట్లు
టీఐఎంఎస్ అల్వాల్, మేడ్చల్ జిల్లా	897.00 కోట్లు	డీఈసీ ఇన్‌ఫ్రా	669 కోట్లు

ఆలయాల్లో న్యాయమూర్తుల పూజలు



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం, సోమశిలలోని ఆలయాలను శనివారం హైకోర్టు న్యాయమూర్తి నాగార్జున్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. సోమశిలలో సోమేశ్వరాలయాన్ని, సింగోటం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం అక్కడ ఉన్న కాటేజీలను పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ రమేష్ నాయక్, ఎస్ఐ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

జోగుళాంబ సన్నిధిలో..

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను శనివారం ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ లక్ష్మణ్‌రావు, కర్నూలు జిల్లా జడ్జి శ్రీనివాస్‌రావు, సీనియర్ సివిల్ జడ్జి దినేష్ రావు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



పట్టువస్త్రాల సమర్పణ



స్టేషన్ మహబూబ్‌నగర్: ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక తిరుమలదేవుని గుట్ట వెంకటేశ్వరస్వామికి గోదా కల్యాణం కోసం శనివారం పట్టువస్త్రాలు సమర్పించారు. పట్టువస్త్రాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా పట్టణంలోని పలు దేవాలయాలను నగర సంకీర్తన పూర్వకంగా వెళ్లి సందర్శిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం ప్రధాన అర్చకుడు రాఘవేంద్రశర్మ, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.

ముగిసిన అర్చక ఆగమ పరీక్షలు


పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

జోగుళాంబ శక్తిపీఠం: దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంగా నిర్వహించిన అర్చక ఆగమ పరీక్షలు సోమవారం సాయంత్రం ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని మండలాల నుంచి 359 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పరీక్షల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ రాజు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా భోజన సౌకర్యాలను పరీక్ష కేంద్రం దగ్గర ఏర్పాటు చేశారు. అర్చక, ప్రవేశ, వర, ప్రవరలకు సంబంధించి వివిధ ఆగమాల నుంచి అర్చకులు పరీక్షలు రాశారు. ఇందులో 40ఏళ్ల వయసు లోబడి ఉన్నవారంతా రెండు రోజులలో పేపర్-1, 2, 3 రాసి, 7వ తేదీ మధ్యాహ్నం మౌఖిక, క్రియ పరీక్షలకు హాజరయ్యారు. చాత్తద శ్రీవైష్ణవ, శైవ ఆగమం, వీరశైవ ఆగమం, పాంచరాత్ర ఆగమం, తంత్రసార ఆగమం, వైదిక స్మార్థ ఆగమం, వైఖానస ఆగమం, గ్రామ దేవత ఆగమం నుంచి పరీక్షలు రాసినట్టు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్‌లు శకుంతల, వెంకటేశ్వరి, వీణాధరి, శ్రీనివాస్ తెలిపారు. ఇన్విజిలేటర్లు పురేంధర్, రంగారావు, రంగాచారి, గ్రేడ్ -2 అధికారులు శేఖర్ గౌడ్, ఉమారాణి, సూపరింటెండెంట్ రఘునాథచారి తదితరులు ఉన్నారు.

మౌఖిక పరీక్షలతో మార్మోగిన సింహగిరి

రెండు రోజులు ఆగమ పరీక్షలలో తొలిరోజు రాత పరీక్షలు ఉండగా, మరుసటి రోజు మౌఖిక పరీక్షలు నిర్వహించడంతో ప్రశ్నలకు సమాధానంగా అర్చక స్వాములు వేదమంత్రాలను ఉచ్చరించి తమ ప్రతిభను చాటడంతో సింహగిరి ఒక్కసారిగా వేదఘోషతో మార్మోగింది.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్పెషల్ స్క్వాడ్

సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయం


మాట్లాడుతున్న కాశి జగత్ గురువులు మల్లికార్జున విశ్వరాధ్య శివాచార్య మహాస్వామి

కృష్ణా: భారతదేశం అంటేనే సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయమని కాశీ జగత్ గురువులు మల్లికార్జున విశ్వరాధ్య శివాచార్య మహాస్వామి అన్నారు. శనివారం మండలంలోని చేగుంటలో నిర్వహించిన జన జాగృతి ధర్మ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు అక్కడి పార్వతీ పరమేశ్వర ఆలయంలో 18 మంది జంగమ వటులకు ఉపనయనం నిర్వహించారు. అనంతరం క్షేత్రానికి చెందిన క్షీరాలింగా మహాస్వామి వారి 63వ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ధార్మిక సమావేశంలో మాట్లాడారు. మంచి సమాజం నిర్మించాలంటే మొదట ఇంట్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలకు మన సంస్కృతిని, భాషను నేర్పించాలని అన్నారు. ప్రతి వ్యక్తి తన ధర్మాన్ని పాటించాలని అప్పుడే సమాజం అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎక్కడైన శివుడు లింగ రూపంలో దర్శనిమిస్తాడు కానీ, ఇక్కడ పార్వతీ పరమేశ్వరులు నిజరూపంలో ఉండడం అద్భుతమని అన్నారు. కార్యక్రమంలో శాంతమల్ల శివాచార్య మహాస్వామి, చెన్నవీర మహాస్వామి, పంచమ సిద్ధలింగా మహాస్వామి, శంబు సోమనాథ మహాస్వాములు హాజరయ్యారు.


ధార్మిక సమావేశానికి హాజరైన భక్తులు

ఆర్డీఎస్ నీరు అందక అవస్థలు


ఉండవెల్లిలో ఆర్డీఎస్ కెనాల్‌లో తగ్గిన నీటిమట్టం

ఉండవెల్లి: మండలంలోని ఆర్డీఎస్ కెనాల్‌లోని డీ–34 నుంచి డీ–40 వరకు నీరు వచ్చినట్లే వచ్చి నిలిచిపోయాయి. శనివారం అలంపూర్, ఉండవెల్లి మండలాల్లోని పంటలకు నీరు వదిలారు. సాయంత్రం లోపు నీరు తగ్గడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మండలాల్లో మొక్కజొన్న, మిరప, మినుములు వేసిన రైతులు ఆర్డీఎస్ కాల్వలో నీరు లేక పంటలు ఎండుదశకు చేరుకున్నాయని తెలిపారు. దాదాపు 1,500 ఎకరాలకు పైగా పంటలకు నీరందించాలని, రైతులు డి. బూడిదపాడులోని ఆర్డీఎస్ అధికారులకు తెలిపినా శుక్రవారం వచ్చిరని, శనివారం సాయంత్రం వరకు నీరు వదల్లేదని రైతులు తెలిపారు. ఆర్డీఎస్ ఏఈ శ్రీనివాసులును వివరణ కోరగా తుంగభద్ర నదిలో నీటి స్థాయి తగ్గిందని తెలిపారు. తుమ్మిళ్ల, జూరాల నీటిని వదలాలని రైతులు కోరుతున్నారు.

నవ్వుతో ఒత్తిడిని అధిగమిద్దాం



అంతర్జాతీయ సదస్సులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మలయా యూనివర్సిటీ అధ్యాపకుడు లిమ్ బూన్ హూయి, వీసీ తదితరులు

- పీయూ అంతర్జాతీయ సదస్సులో మలేషియా అధ్యాపకుడు లిమ్ బూన్ హూయి
- 150కిపైగా పరిశోధన పత్రాలను సమర్పించిన వివిధ యూనివర్సిటీల విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఒత్తిడిని అధిగమించేందుకు నవ్వు ఒక సాధనంలా ఉపయోగపడుతుందని మలేషియాలోని మలయా యూనివర్సిటీ అధ్యాపకుడు లిమ్ బూన్ హూయి అన్నారు. శనివారం పాలమూరు యూనివర్సిటీలో ‘రీసెంట్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిట్‌నెస్ అండ్ స్పోర్ట్స్ సైన్స్– 2022’ అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ‘మానసిక ఆరోగ్యంపై నాన్‌- ఫార్మకోలాజిక్ ప్రభావం’ అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించి మాట్లాడారు. నవ్వు అనేది మనిషిలో ఒక సాధారణ జీవన విధానంలా ఉంటుందని, దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే ఒక ఔషధంలా పని చేస్తుందన్నారు. అంతకు ముందు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మారుతున్న ఆధునిక జీవనశైలిలో ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ మనిషి పూర్తి ఆరోగ్యంగా జీవించాలంటే తప్పకుండా మంచి ఆరోగ్య అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, సరైన నిద్రతో మనిషిని ఒత్తిడి, రోగాలకు దూరంగా ఉంచుతాయని పేర్కొన్నారు. అనంతరం పీయూతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు పీహెచ్‌డీ స్కాలర్స్ కార్యక్రమంలో పాల్గొని దాదాపు 150కిపైగా పరిశోధన పత్రాలను సమర్పించారు. వీటిని పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు పీయూలో మూడు భవనాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి, చిన్నప్పరెడ్డి, గురుదీప్‌సింగ్, నీరజ్‌జైన్ లక్నో యూనివర్సిటీ, పీయూ రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, పిండి పవన్‌కుమార్, ఓయూ పీడీ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా పదోన్నతులపై ప్రకటన


భూత్పూర్‌లో ప్రచారం చేస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

భూత్పూర్: ఉపాధ్యాయుల పదోన్నతులకు సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని, వారం రోజుల్లో ప్రకటన వెలువడనుందని టీపీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమాలాకర్‌రావు అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా శనివారం మున్సిపాలిటీతో పాటు మండలంలోని తాటికొండ, అన్నాసాగర్, పోతులమడుగు, ఎల్కిచర్ల, కొత్త మొల్గర, పాత మొల్గర ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ గురుకుల పాఠశాలను సందర్శించారు. అన్ని సమస్యలను పరిష్కరించేందుకు టీపీఆర్టీయూ టీఎస్ కృషి చేస్తుందని సంఘం బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గుర్రం చెన్న కేశవరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్ గౌడ్, రఘురామిరెడ్డి, బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం 1,020అడుగుల వరకు నీరువచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 200, సమాంతర కాల్వ ద్వారా 802 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 120, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.